

సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డిజిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింహారావు

### ఆధునిక వ్యవసాయంలో

# సాంకేతిక పరిజ్ఞానం కీలకపాత్ర

### రంగారెడ్డిజిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింహారావు

షాబాద్, జూన్ 12 : ఆధునిక వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం కీలకపాత్ర పోషిస్తుందని రంగారెడ్డిజిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింహారావు అన్నారు. గురువారం షాబాద్‌లోని రైతువేదికలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. రైతులు, కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్తలు ఉత్సాహంగా పాల్గొని కాలానుగుణంగా వ్యవసాయ విధానాలు, వాతావరణ అనుకూల వ్యవసాయ సాంకేతికతలను రైతులకు వివరించారు. భవిష్యత్తులో ఆహార భద్రత, పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి ఎంతో అవసరమని చెప్పారు. రైతులు ఎదుర్కొంటున్న ప్రాథమిక సవాళ్లను గుర్తించి, సాంకేతిక పరిజ్ఞానం, పరిష్కార మార్గాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా డీఏవో నర్సింహారావు మాట్లాడుతూ.. సరైన సాంకేతికతను అందుబాటులోకి తేవడం, ఉపసంహార పథకాలపై అవగాహన కల్పించడం ద్వారా రైతులు పంటల ఉత్పాదకతను పెంపొందించడంతో పాటు, వ్యయాలను తగ్గించుకోగలుగుతారని తెలిపారు. అదేవిధంగా వ్యవసాయం గ్రామీణ జీవనోపాధికి ఎంతో అవసరమైందని, ఇది రైతుల ఆర్థిక భద్రతకు, సంపూర్ణ సంక్షేమానికి మూలాధారమని చెప్పారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి ఈ రకమైన జ్ఞానం, ప్రభుత్వ మద్దతు అనివార్యమని ఆయన తెలిపారు.

శాస్త్రవేత్త డాక్టర్ కె.వి.రావు మాట్లాడుతూ.. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై జ్ఞానం, అవగాహన పెంపొందించడం ద్వారా రైతులను సాధికారత దిశగా నడిపించడమే లక్ష్యమని చెప్పారు. ఇందులో భాగంగా సమర్థవంతమైన నీటి నిర్వహణ, డ్రిప్ ఇరిగేషన్ ప్రయోజనాలు, విజ్ఞానపూర్వకంగా వ్యవసాయాన్ని నిర్వహించే తీరు వంటి ముఖ్యమైన అంశాలను వివరించారు. ఇవి పంట దిగుబడులు పెంపొందించడంలో కీలకమని తెలిపారు. రైతుల కోసం అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాల గురించి కూడా వివరించారు. స్వాభావిక వనరుల స్థిరమైన వినియోగం మీద ఆయన దృష్టి సారించి, దీర్ఘకాలిక వ్యవసాయ అభివృద్ధి, పర్యావరణ సమతుల్యత కోసం ఇది అత్యంత అవసరమని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం పాల్గొన్నారు.

### జాతీయ విద్యావిధానం-2020తో

# అద్భుత ఫలితాలు

### ఏఐసీటీఈ చైర్మన్ టి.జి.సీతారాం



సదస్సులో మాట్లాడుతున్న ఏఐసీటీఈ చైర్మన్ టి.జి.సీతారాం

చేవెళ్ల రూరల్, జూన్ 12 : జాతీయ విద్యా విధానం-2020తో పాఠశాల, ఉన్నత విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణలకు మార్గం సుగమమైందని, నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా అద్భుత ఫలితాలు వచ్చాయని ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ టి.జి.సీతారాం స్పష్టం చేశారు. శంకర్‌పల్లి మండలం దొంతాన్‌పల్లిలో ఉన్న ఇక్ఫాయ్ వర్సిటీ ఆధ్వర్యంలో 'ఉన్నత విద్యలో విప్లవాత్మక సంస్కరణలు, జాతీయ విద్యా విధానం-2020 అమలులో ఉత్తమ పద్ధతులు' అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన సీతారాం మాట్లాడుతూ.. 21వ శతాబ్ద అవసరాలకనుగుణంగా, ప్రతి విద్యార్థి సామర్థ్యాలను బహుముఖంగా వెలికితీసే లక్ష్యంతో ఎన్ఈపీ రూపొందించబడిందన్నారు. భారత్‌ను జ్ఞాన సమాజంగా, ప్రపంచంలో సూపర్ పవర్‌గా మార్చడంలో ఈ విధానం కీలకపాత్ర పోషిస్తున్నదని, 2047 నాటికి ప్రధానమంత్రి ఆశించినట్లు దేశం జీడీపీలో అగ్రస్థానం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం విశిష్ట అతిథిగా మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ ఛాన్సలర్ లెఫ్టినెంట్ జనరల్ డాక్టర్ ఎం.డి.వెంకటేష్ వర్చువల్గా మాట్లాడారు.

ఇక్ఫాయ్ వీసీ ప్రొఫెసర్ ఎల్.ఎస్.గణేశ్ అధ్యక్షత నిర్వహించిన ఈ సదస్సులో హెచ్‌సీయూ వీసీ బి.జె.రావు, ఐఐఐటీ డైరెక్టర్ బి.ఎస్.మూర్తి, హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ పి.జె.నారాయణ, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కె.ఎస్.సత్యనారాయణ, జేఎన్‌టీయూ వీసీ టి.ఎస్.కిషన్ కుమార్‌రెడ్డి, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ డైరెక్టర్ ఎం.కృష్ణమూర్తి, యూజీసీ డిప్యూటీ సెక్రటరీ లెఫ్టినెంట్ కమాండర్ వినోద్ సింగ్‌యాదవ్, ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్ డైరెక్టర్ కె.ఎస్.వేణుగోపాల్, ఇక్ఫాయ్ అకాడమిక్ సీనియర్ డైరెక్టర్ ఆర్.ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

### జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, జూన్ 12 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల నియంత్రణకై జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో దోమ కాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా లాంటి వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రణాళికబద్ధంగా కార్యాచరణ రూపొందించుకొని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వసతి గృహాలు, పాఠశాలల్లో ప్రత్యేకంగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని.. ముందస్తుగానే జ్వరం, దగ్గు, జలుబుకు సంబంధించిన మందులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రతిరోజూ ఇంటింటి సర్వే నిర్వహించి ఎలాంటి వ్యాధికి గురయ్యారో నిర్ధారణ చేసి మందులు అందించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని తెలిపారు. నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేస్తూ తాగునీటిని అందించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో మురుగునీరు నిలువకుండా, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూనే ప్రజలను, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో సీజనల్ వ్యాధులను నివారించే అన్ని జాగ్రత్తలు చేపట్టాలని వివరించారు. గ్రామాల్లో డాక్టర్లు, ఆశా వర్కర్లు ఎప్పుడూ అందుబాటులో చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, సమాచార నిమిత్తం 9702705161ను సంప్రదించాల్సిందిగా అదనపు కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీటీడీవో కమలాకర్‌రెడ్డి, డీబీసీడీవో ఉపేందర్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్‌నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీంద్రయాదవ్, వివిధ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న తెలంగాణ మోడల్ స్కూల్స్ డీడీ

# ఉత్తమ ఫలితాలు సాధించాలి

### తెలంగాణ మోడల్ స్కూల్స్ డీడీ దుర్గాప్రసాద్

చేవెళ్ల రూరల్, జూన్ 12 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని తెలంగాణ మోడల్ స్కూల్స్ డీడీ దుర్గాప్రసాద్ సూచించారు. గురువారం శంకర్‌పల్లిలోని మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాల), జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధన దిశగా అడుగు వేస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు వీలుంటుందని, ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని పెట్టుకొని ముందుకు సాగితే విజయం సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యలో రాణించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల చదువుపై ఆయన చర్చించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి సయ్యద్ అక్బర్, మున్సిపల్ కమిషనర్ యోగేశ్, మోడల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్, సిబ్బంది, ఉపాధ్యాయులున్నారు.



విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న డీఈఓ రేణుకాదేవి

## దుస్తులు పంపిణీ

బంట్వారం, జూన్ 12 : మండల పరిధిలోని బుక్కన్నారం గ్రామంలో గురువారం విద్యా సంవత్సర ప్రారంభ వేడుకల్లో డీఈవో రేణుకాదేవి పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థికి అన్ని వసతులు కల్పిస్తూ విద్యాబోధన కొనసాగించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు అవసరమయ్యే యూనిఫామ్స్, టెక్స్ట్‌బుక్స్, నోట్‌బుక్స్, ఉత్తమ మౌలిక సదుపాయాలు కల్పిస్తూ విద్యా బోధన చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయులు బోధిస్తారని తల్లిదండ్రులు గ్రహించాలన్నారు. విద్యార్థులు ఉత్తమ సామర్థ్యాలు ప్రదర్శించినప్పుడే పూర్తిగా విజయవంతమైనట్లుగా అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యాబోధన చేయాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వరరావు, సీజీహెచ్‌ఎం విక్రమ్‌రెడ్డి, ఏఎంవో రామ్, ప్రధానోపాధ్యాయురాలు అంజమ్మ పాల్గొన్నారు.



చెక్‌డ్యామ్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ రవీందర్

## చెక్‌డ్యామ్, నర్సరీల పరిశీలన

నవాబుపేట, జూన్ 12 : మండల పరిధిలోని యావాపూర్ చెక్‌డ్యామ్, వట్టిమీనపల్లిలోని నర్సరీలను రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన చెక్‌డ్యామ్ రైతులకు ఏ విధంగా ఉపయోగకరంగా ఉంటుందనే విషయాన్ని ఎంపీడీవో అనురాధను అడిగి తెలుసుకున్నారు. వట్టిమీనపల్లిలోని నర్సరీని సందర్శించిన అనంతరం మొక్కలకు తీసుకుంటున్న జాగ్రత్తలు, సంరక్షించడానికి అవలంబిస్తున్న పద్ధతులు, వాడే ఎరువు విధానంపై వివరాలను ఆయన సేకరించారు. కార్యక్రమంలో డీపీవో జయసుధ, డీఎల్‌పీవో సంధ్యారాణి పాల్గొన్నారు.

## గిరిజన ఆడబిడ్డలంటే అంత చులకనా..?

షాద్‌నగర్, జూన్ 12 : కాంగ్రెస్ పాలనలో గిరిజనులకు రక్షణ లేకుండా పోయిందని గిరిజన ఆడబిడ్డలంటే అంత చులకనగా కనిపిస్తున్నారా అని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మూడావత్ రాంబల్‌నాయక్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సింగర్ మంగ్లీ విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరును గురువారం తీవ్రంగా ఖండిస్తూ మాట్లాడారు. బాత్రూంలో గిరిజన మహిళల వీడియోలు తీసినవారిపై తక్షణమే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. లంబాడీ ఆడపిల్ల కనుకనే సింగర్ మంగ్లీని ఇరికించే కుట్ర జరుగుతున్నదని, కొంతమంది కుటుంబ సభ్యుల మధ్య బర్త్ డే వేడుకలు నేరమా అని ప్రశ్నించారు. మహిళలున్న గదిలో.. బెడ్ రూంలలో.. బాత్‌రూంలలోకి వెళ్లి పోలీసులు వీడియోలు తీసి బహిర్గతం చేయడం చట్ట విరుద్ధమని, అందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మంగ్లీకి డ్రగ్స్‌ను అంటగంటే ప్రయత్నం చేస్తున్న దుర్మార్గమైన ప్రచారాన్ని ఖండించాల్సిన అవసరం ఉందన్నారు.

## అక్రమ షెడ్లు తొలగించాలి

బడంగ్‌పేట్, జూన్ 12: గుర్రంగూడలో ఎలాంటి అనుమతి లేకుండా షెడ్ల నిర్మాణం చేస్తున్నా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని మాజీ కార్పొరేటర్ లక్ష్మారెడ్డి ఆరోపించారు. అక్రమ షెడ్లను తొలగించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. షెడ్డుకు అనుమతి లేకపోగా సెట్ బ్యాక్‌లు కూడా వదలడం లేదన్నారు. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.



తమ సమస్యలు పరిష్కరించాలని గురువారం వెటర్నరీ ఉద్యోగులు మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి సమస్యలు వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చినట్టు తెలిపారు. మంత్రి స్పందించడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. - కొడంగల్, జూన్ 12



## ఉత్తమ బౌలర్‌గా మహేశ్వరి

షాద్‌నగర్, జూన్ 12 : షాద్‌నగర్ గిరిజన సంక్షేమ మహిళ డిగ్రీ పీజీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మహేశ్వరి ఉత్తమ బౌలర్‌గా అవార్డును అందుకున్నది. ఈ సందర్భంగా హెచ్‌సీఏ జాయింట్ సెక్రటరీ బసవరాజ్ మహేశ్వరికి అవార్డును అందజేసి ప్రత్యేకంగా అభినందించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నీతాపోలే తెలిపారు. మహిళా క్రికెట్ టోర్నీలో భాగంగా మొదటి మ్యాచ్‌లో నాలుగు, రెండో మ్యాచ్‌లో రెండు వికెట్లు తీసి ఉత్తమ బౌలర్ అవార్డును అందుకున్నట్లు వివరించారు. తమ కళాశాలకు చెందిన విద్యార్థినికి అవార్డు రావడంపై కళాశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

## అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

వికారాబాద్, జూన్ 12 : వికారాబాద్ జిల్లాతో పాటు పలు జిల్లాల్లో రైతులు, విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం కలిగిస్తూ, సంవత్సరాలుగా పోలీసులకు సవాలుగా మారిన అంతర్రాష్ట్ర ట్రాన్స్‌ఫార్మర్ల దొంగ నందూలాల్ రాజ్‌బార్‌ను నవాబుపేట పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. జిల్లాలో 30కి పైగా ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనం కేసుల్లో నాన్-బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్న ఇతడిని, వారం రోజులపాటు శ్రమించి ఉత్తరప్రదేశ్‌లోని అతని స్వస్థలంలో అదుపులోకి తీసుకున్నారు. అన్ని జిల్లాల్లో కలిపి ఇతడిపై 300 పైగా ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి.

### పోలీసుల ప్రత్యేక ఆపరేషన్

నిందితుడు ఉత్తరప్రదేశ్‌లో ఉన్నట్లు పక్కా సమాచారం మేరకు నవాబుపేట ఎస్ఐ అరుణ్‌కుమార్, సిబ్బంది అక్కడికి వెళ్లారు. వారం రోజులకు పైగా అజాంగఢ్ జిల్లాలో మకాం వేసి, స్థానిక పరిస్థితులను అధిగమించి, నిందితుడి కదలికలపై నిఘా పెట్టి, చాకచక్యంగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో నవాబ్‌పేట్ పోలీసుల కృషి, అంకితభావం ప్రశంసనీయమని ఎస్పీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. నిందితుడిని వికారాబాద్ కోర్టులో హాజరుపరచనున్నామని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ముఠాలో ఉన్న ఇతరులను కూడా అరెస్టు చేయడం జరుగుతుదని వెల్లడించారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రముఖ పాత్ర వహించిన ఎస్ఐ అరుణ్‌కుమార్‌తో పాటు హెడ్ కానిస్టేబుళ్లు మహిపాల్‌రెడ్డి, భాస్కర్ రాథోడ్, పోలీస్ కానిస్టేబుళ్లు రమేశ్, నరేశ్‌లను గురువారం ఎస్పీ అభినందించారు.



దొంగను పట్టుకున్న నవాబుపేట ఎస్సై అరుణ్‌కుమార్ సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి, ఇన్‌సెట్లో దొంగ నందులాల్

- తరచుగా రోడ్లపై నిలిచినా పట్టించుకోని అధికారులు
- అక్రమ నిర్మాణాలతో రోడ్లపై పెద్దఎత్తున నిలుస్తున్న వర్షపునీరు
- వర్షాకాలం ఆరంభమైనా కానరాని చర్యలు
- అవస్థలు పడుతున్న వాహనదారులు, రాకపోకలకు తీవ్ర ఇబ్బంది

# చినుకుపడితే జలమయం



ఇబ్రహీంపట్నం సాగర్ రహదారిలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద నిలిచిన వర్షపునీరు

ఇబ్రహీంపట్నం, జూన్ 12 : ఇబ్రహీంపట్నం సాగర్‌రహదారితో పాటు మంచాల రోడ్డులో వర్షపునీరు ప్రవహించే ప్రధాన కాల్వలను ధ్వంసం చేసి వాటిపై అక్రమ నిర్మాణాలు చేపట్టారు. దీంతో వర్షం కురిసినప్పుడల్లా ప్రధాన రోడ్లపై వర్షపునీరు సుమారు మోకాళ్ల పైకి చేరడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా మంచాల రోడ్డులోని భారత్‌గార్డెన్ సమీపంలో వర్షపునీరు పూర్తిగా రోడ్డుపైకి చేరటంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతున్నది. గురువారం కురిసిన వర్షానికి రోడ్లపై నీరు పెద్దఎత్తున చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వీటిపై ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కరించాల్సిన మున్సిపల్ అధికారులు మాత్రం ఏమీ పట్టించుకోవడంలేదనే ఆరోపణలొస్తున్నాయి. ఇబ్రహీంపట్నం మంచాల రోడ్డులోని భారత్ గార్డెన్ సమీపంలో అక్రమ నిర్మాణాలు పెద్దఎత్తున చేపట్టి వర్షపునీరు పోయేందుకు కూడా వీలు లేకుండా పోయింది. సాగర్ రహదారిలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నది. దీనిని పరిష్కరించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.



నేషనల్ హైవే 44 అండర్‌పాస్ కింద నీరు నిలువగా.. ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

### ఒకవైపు వంతెన నిర్మించి.. మరోవైపు వదిలేసి..

ఇబ్రహీంపట్నం ప్రాంతంలో మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఇబ్రహీంపట్నం పెద్దచెరువు పూర్తిగా నిండి మూడు నెలలు అలుగు పారింది. ఈ ఉధృతికి సాగర్‌రహదారిలోని శేరిగూడ సమీపంలోని కల్వర్టు తెగిపోయింది. వంతెన నిర్మాణం కోసం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి వంతెన నిర్మాణం కోసం నిధులు ప్రభుత్వం నుంచి తీసుకువచ్చి పనులు ప్రారంభించారు. ఎన్నికల సమయంలో ఓవైపు వంతెన పూర్తి కాగా.. మరోవైపు పనులు నిలిచిపోయాయి. దీంతో వర్షాలు పడిన సమయంలో ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. నిర్మాణ పనులు పూర్తిచేయాల్సిన కాంగ్రెస్ సర్కారు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నదని స్థానికులు, ప్రయాణికులు అంటున్నారు. వెంటనే వంతెన నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం కలుగకుండా చూడాలని కోరుతున్నారు.



కొత్తూరు : జేపీ దర్గా రోడ్డులో నిలిచిన నీరు



కొత్తూరు : ఏడో వార్డులో నిలిచిన నీరుతో కాలనీవాసులు ఇబ్బందులు

ఇబ్రహీంపట్నంలోని ముంపు ప్రాంతాలు

ఇబ్రహీంపట్నంలోని మంచాల రోడ్డు భారత్ గార్డెన్ సమీపంలో కల్వర్టును అక్రమించి ఇళ్లు నిర్మించారు. దీంతో చిన్న వర్షం కురిసినా నీరు నిలుస్తున్నది. అలాగే, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయం వద్ద సాగర్ రహదారి సమాంతరంగా లేక వర్షం నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంపట్నం పాత గ్రామంవైపు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డులోని సంతోష్ థియేటర్ సమీపంలో మురుగుకాలువ చిన్నగా ఉన్నది. భారీ వర్షం కురిసినప్పుడు ఈ ప్రాంతం మునిగిపోతుంది. ఇక్కడ మురుగు కాల్వను పెద్దగా నిర్మించాల్సిన అవసరమున్నది. అనేక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో ప్రధాన రహదారులపైకి నీరుచేరి ప్రయాణికులు, ప్రజలు, అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి జలమయమయ్యే ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



ఇబ్రహీంపట్నం : కల్వర్టు వద్ద..



పారిశ్రామిక ప్రాంతం నుంచి తీగాపూర్ వెళ్లే రోడ్డు మధ్యలో నిలిచిన నీరు

### రోడ్లన్నీ జలమయం

**కొత్తూరు :** గురువారం మధ్యాహ్నం కురిసిన చిన్నపాటి వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. వర్షం పడటం ఆగినా నీరు రోడ్లపై పారుతుండటంతో వాహనదారులతో పాటు కాలనీల ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా నేషనల్ హైవే 44 కింద వై జంక్షన్ వద్ద నిర్మించిన అండర్ పాస్‌కింద నీరు చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే జేపీ దర్గా రోడ్డులో నీరు నిలువడంతో అటుగా వెళ్లేవారు అవస్థలు పడ్డారు. 7వ వార్డులో నీరు నిలిచి కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. పారిశ్రామిక ప్రాంతంలో కూడా రోడ్డుపై నీరు నిలిచి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.